క్లుప్తంగా

పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్ దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల లక్ష్యాలు సాధించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. కాగజ్‌నగర్ డివిజన్‌కు సబ్ కలెక్టర్‌ను నియమించిన నేపథ్యంలో అభివృద్ధి పనులకు అధికారులు తమవంతు సహకారం అందించాలన్నారు.

ఇంటర్నెట్ పునరుద్ధరించాలని నిరసన



నిరసన తెలుపుతున్న యువకులు, రైతులు

తిర్యాణి(ఆసిఫాబాద్): మండలంలో ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ పలువురు యువకులు, రైతులు సోమవారం మండల కేంద్రంలోని కుమురంభీం చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ఇంటర్నెట్ అందుబాటులో లేకపోవడంతో మీసేవ, బ్యాంకు, ఇతర ఆన్‌లైన్ సేవలు అందక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఇంటర్నెట్ పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసిన నాయకులు



పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు

బెజ్జూర్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, బెజ్జూర్ మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణ యాదవ్‌లు కేంద్ర హోం సహాయక మంత్రి బండి సంజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రిను కలిసి గజమాలతో సత్కరించారు. జిల్లా పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు వారు వివరించారు.

శానిటరీ జవాన్ మృతి



కాసర్ల శ్రీనివాస్ (ఫైల్)

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో శానిటరీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్న కాసర్ల శ్రీనివాస్ (57) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. రెండు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా.. ఆదివారం రాత్రి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబసభ్యులు కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రెబ్బెన: వాతావరణ శాఖ జారీ చేసిన అధిక వర్షాల నేపథ్యంలో మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రామ్మోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని దాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలన్నారు. వట్టివాగు, కుమురం భీం ప్రాజెక్టుల గేట్ల ఎత్తి వరదనీటిని వదలడం మూలంగా వాగులు, నదుల వైపు ప్రజలు వెళ్లకూడదన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లకు, కట్టడాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా ప్రమాదాలకు గురైతే వెంటనే రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఆదిలాబాద్ జిల్లా సార్‌మేడిగా గంగాధర్

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లా సార్‌మేడిగా సిడాం గంగాధర్‌ను రాజ్‌గోండ్‌సేవా సమితి రాష్ట్ర సమితి సభ్యులు సోమవారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని గుస్సాడిగుట్టలో నిర్వహించిన సమావేశంలో జిల్లా సార్‌మేడిగా కొనసాగుతున్న మెస్రం దుర్గును రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. అన్ని రాయిసెంటర్ల సార్‌మేడిలు ఆమోదించాలని కోరారు. ఎన్నికైన సభ్యులను సన్మానించారు.

అధ్వానంగా రహదారి..



గుంతలమయంగా పంగిడిమాదర నుంచి లింగాపూర్‌కు వెళ్లే రోడ్డు

- ఇసుక ట్రాక్టర్లతో గుంతలమయం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

తిర్యాణి: అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్లపై అధిక లోడుతో ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండటంతో రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. మండలంలో 29 గ్రామ పంచాయతీలుండగా.. 134 అనుబంధ గ్రామాలున్నాయి. కాగా కనీస రోడ్డు సౌకర్యం లేని గ్రామాలు 40 శాతంకు పైగా ఉన్నాయి. అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు సైతం అక్రమార్కుల అధిక లోడు ఇసుక అక్రమ రవాణా చేయడంతో పూర్తిగా చెడిపోతున్నాయి. అయినా.. అక్రమ రవాణాకు అధికారులు అడ్డుకట్ట వేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అత్యవసర సమయంలో..

జిల్లాలోని లింగాపూర్, సిర్పూర్(యూ), జైనూర్ మండలాల్లో ఇసుక నిల్వలు తక్కువగా ఉండటంతో అక్కడి వ్యక్తులు ఆసిఫాబాద్ మండలంలోని చిర్రకుంట గ్రామంలోని వాగు నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మండలంలోని పంగిడి మాదర మీదుగా లింగాపూర్ మండలాలకు తరలిస్తున్నారు. అసలు రోడ్డు తారు లేచి ఉండటం దీనికి తోడు రోజుకు 20 నుంచి 50 ట్రాక్టర్లు నడుస్తుండటంతో డ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. కొంతమంది ట్రాక్టర్ యాజమానులు ఎలాంటి అనుమతి లేకుండానే ఇసుక రవాణా చేస్తున్నారు. పంగిడిమాదర గ్రామం నుంచి దాంపూర్, కొటగాం, లింగాపూర్, సిర్పూర్(యూ) గ్రామాలకు వెళ్లే ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఆ రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వాహనాలు అదుపు తప్పి కిందపడి గాయాలు అయిన ఘటనలు ఉన్నాయి. అత్యవసర సమయంలో అంబులెన్స్ వాహనం వెళ్లలేని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు నిర్మించాలి

ఆసిఫాబాద్ మండలంలోని చిర్రకుంట వాగు నుంచి ఇసుకను పంగిడిమాదర మీదుగా లింగాపూర్ మండలానికి తీసుపోకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండటంతో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారుతుంది. తిర్యాణి నుంచి పంగిడిమాదర మీదుగా లింగాపూర్ వెళ్లాం అంటే కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లడం లేదు. రోడ్డు నిర్మాణం కోసం నిధులు విడుదల చేసి, పనులు ప్రారంభించాలి. – గెడం సుభాశ్, తుడుందెబ్బ జిల్లా నాయకుడు

కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు



పూజలందుకుంటున్న గణనాథుడు



పూజలు చేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో ఈనెల 7న ప్రారంభమైన గణేశ్ నవరాత్రోత్సవాలు సోమవారం మూడో రోజు పలు కాలనీల్లో నెలకొల్పిన గణనాథులకు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆర్టీసీ డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద అర్చకులు జంబోజుల తిరుపతిచారి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని గణేష్ మందిర్, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, సందీప్‌నగర్, బజార్‌వాడీ, జన్కాపూర్, టీఆర్‌నగర్, బెస్తవాడ, కంచుకోట, రాజంపేట, రావులవాడతో పాటు పలు కాలనీల్లో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాద వితరణ చేపట్టారు.

గణనాథుడికి పూజలు

కౌటాల: మండలంలోని భక్తులు సోమవారం భక్తిశ్రద్ధలతో ఆయా గణేశ్ మండపాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడు మండలంలోని అన్ని గ్రామాల్లో పూజలందుకుంటున్నాడు. గణేశుని పాటలతో మండపాలు మార్మోగుతున్నాయి. మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

'పోషణ్ అభియాన్' పకడ్బందీగా అమలు చేయాలి



మాట్లాడుతున్న సీడీపీవో రెబకా

కాగజ్‌నగర్ రూరల్: 'పోషణ్ అభియాన్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీడీపీవో రెబకా అన్నారు. సోమవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో 'పోషణ్ అభియాన్' సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నెల రోజుల పాటు పోషణ మాసం నిర్వహించడం జరుగుతుందన్నారు. చిరుధాన్యాలతో తయారు చేసిన వాటిని చిన్నారులు, బాలింతలకు అందించాలన్నారు. దీంతో వారిలో రక్తహీనత సమస్య తగ్గుతుందన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల పోషకాహారాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, రమాదేవి, సరోజనదేవి, మాధవి, అనసూర్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

'పీఆర్సీని వెంటనే ప్రకటించాలి'



మాట్లాడుతున్న శ్రీనివాస్

పెంచికల్‌పేట్: ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు పీఆర్సీని వెంటనే ప్రకటించాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల కార్యవర్గ ఎన్నికల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న తంగిడిపల్లి రాకేశ్‌ను సన్మానించారు.

మండల కార్యవర్గం ఎన్నిక..

పీఆర్టీయూ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండు యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్, అసోసియేట్ అధ్యక్షుడిగా జాఫర్, మహిళా ఉపాధ్యక్షురాలుగా ప్రియాంక, కార్యదర్శిగా శేఖర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ నిర్మల, గంగాభవాని, ఉదయ్‌కిరణ్, ఆత్మారావు, బడే సాహెబ్, ఉపేంద్ర, హర్షియా పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలను గౌరవించాలి

- గిరిజన సంఘాల నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న పెసా చట్టం నాయకులు భరత్

కెరమెరి: ఆదివాసీ చట్టాలను ప్రతిఒక్కరూ గౌరవించాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆదివాసీభవన్‌లో వ్యాపారులు, గిరిజనేతరులు, ఆదివాసీ సంఘాల నాయకులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ రక్షణ కోసం పెసా, 1/70, ఆర్టికల్ 375(1), మానవాటే మావరాజ్, 5వ షెడ్యూల్ లాంటి చట్టాలు అమల్లో ఉన్నాయన్నారు. వాటిని అతిక్రమిస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కుటంబాలను నిలువరించాలని, కొత్తగా వ్యాపారాలు చేపట్టరాదన్నారు. ఎవరైనా వ్యాపారం చేయాలనుకుంటే పెసా అనుమతి తీసుకోవాలన్నారు. ఏజెన్సీలో గిరిజనేతరులు క్రయవిక్రయాలు జరపవద్దన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు కోవ విజయ్, భరత్, ప్రభాకర్, ఇందిరా, పెందోర్ మోతిరాం, భీంరావు, అంబరావు, జగన్నాథ్‌రావు, దండు, కుసుంబ్‌రావు, తుకారాం, రాజేశ్వర్, వ్యాపారులు అబ్దుల్ కలాం, గణేశ్, ఎల్లప్ప, మున్ను, జగన్, రామారావు, లక్ష్మణ్, రామకృష్ణ పాల్గన్నారు.

తెరుచుకున్న దుకాణాలు..

జైనూర్‌లో ఇటీవల జరిగిన ఘటన నేపథ్యంలో ఈ నెల 4 నుంచి మూసి ఉన్న వ్యాపార సముదాయాలు ఎట్టకేలకు సోమవారం తెరుచుకున్నాయి. వ్యాపార సంఘాల నాయకులతో పాటు కుల పెద్దలతో ఆదివాసీ నాయకులు నిర్వహించిన చర్చలు సఫలీకృతం కావడంతో వ్యాపారాలు తెరి చేందుకు ఆదివాసీ నాయకులు అనుమతించారు.

12 నుంచి నిరసన కార్యక్రమాలు

జైనూర్ ఘటన నేపథ్యంలో ఈనెల 12 నుంచి ఆదివాసీల సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆదివాసీ సంఘాల నాయకులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన చర్చాగోష్టిలో మాట్లాడారు. ఈనెల 12, నల్లగుడ్డలతో మహిళల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించాలని, ముస్లింలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసేలా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. 17న రాయిసెంటర్లో సమావేశం ఏర్పాటు, 21న మండల కేంద్రంలో ధర్నా, రాస్తారోకో, 23న ఏటీడీఏ ఎదుట ఆందోళన, ధర్నా, 26న జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట బైఠాయింపు, 30 సమీక్షా సమావేశాల నిర్వహిద్దామని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు కోవ విజయ్, భరత్, ప్రభాకర్, ఇందిరా, పెందోర్ మోతిరాం, భీంరావు, అంబరావు, జగన్నాథ్‌రావు, దండు, కుసుంబ్‌రావు, తుకారాం, రాజేశ్వర్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

సిర్పూర్(టి): ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మధ్యాహ్న భోజన కార్మికులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. ఎంఈవో కార్యాలయంలో తమ సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో మధ్యాహ్న భోజన కార్మికులు దుర్భర జీవితం గడుపుతున్నారని, ప్రభుత్వం స్పందించి మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతం చెల్లించి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు ఎర్రం కాంత, విజయ, లక్ష్మి, ఆశక్క పాల్గొన్నారు.

పారిశుద్ధ కార్మికుల సమస్యలు..

సిర్పూర్(టి) మేజరు గ్రామ పంచాయతీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బహుజన నాయకుడు దుర్గం ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపారు. గత 10 నెలలుగా వేతనాలు రాక పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గ్రామపంచాయతీ కార్యదర్శి తిరుపతికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు



అభినందనలు తెలుపుతున్న నాయకులు

రెబ్బెన: టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన బొమ్మ మహేశ్‌గౌడ్‌ను సోమవారం మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుదర్శన్‌గౌడ్, మడ్డి శ్రీనివాస్‌గౌడ్, చిరంజీవిగౌడ్, శాంతికుమార్‌గౌడ్, గోగర్ల శోభన్, రియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

ఒలింపిక్స్ విజేతను కలిసిన జిల్లా విద్యార్థినులు



దీప్తితో అంజలి, సాక్షి

ఆసిఫాబాద్‌రూరల్: ఇటీవల ప్యారిస్ పారా ఒలింపిక్‌లో కాంస్య పతకం సాధించిన జీవాంజి దీప్తిని జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడ పాఠశాలకు చెందిన ఆత్రం అంజలి, సాక్షిలు సోమవారం కలిశారు. హైదరాబాద్‌లో పాటే ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమేశ్ వద్దనే కోచింగ్ తీసుకున్నట్లు డీఎస్‌వో మీనారెడ్డి సోమవారం తెలిపారు. వీరు కూడా ఒలింపిక్ స్థాయికి ఎదగాలని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, డీటీడీవో రమాదేవి ఆకాంక్షించారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ భూమేశ్వర్



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

బెజ్జూర్: పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని బెజ్జూర్ తహసీల్దార్ భూమేశ్వర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గణేష్ మండపాల నిర్వాహకులు, ముస్లిం మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలతో పాటు మిలాద్–ఉన్–నబీ వేడుకలు ఒకేసారి రావడం జరిగిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. సమావేశంలో గ్రామ కార్యదర్శి తుకారాం, శ్రీ రంగనాయక ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగడపల్లి మహేశ్, గోల్కొండ మస్జిద్ అధ్యక్షుడు అమీరుద్దీన్, జావిద్ అలీ, రామగిరి శ్రీనివాస్, హకీం పాల్గొన్నారు.

సిర్పూర్(టి): వినాయక చవతి, మిలాద్ ఉన్ నబీ పండుగలు హిందూ, ముస్లింలు సోదరభావంతో ప్రశాంతంగా జరుపుకోవాలని సిర్పూర్(టి) తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్సై కమలాకర్, ఎంపీడీవో సత్యనారాయణ, బామినే పోషం, సిబ్బంది పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వాన

కౌటాల: కౌటాల మండలంలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. దీంతో మండలంలో జన జీవనం స్తంభించింది. భారీ వర్షం కారణంగా కౌటాల మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గుంతల్లో వరద నీరు నిలిచింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. అలాగే వారసంత స్థలం బురదమయంగా మారింది. ప్రాణహిత, వార్ధా నదుల సమీపంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



బురదమయంగా వారసంత

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ కళావతి

రెబ్బెన: పోషక విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని తీసుకోవటం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి అన్నారు. సోమవారం మండలంలోని కొండపల్లిలో పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యకరంగా ఉన్నప్పుడే వారి కుటుంబం బాగుంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరాఫరా చేస్తున్న బాలామృతాన్ని క్రమం తప్పకుండా పిల్లలకు తినిపించాలన్నారు. మనం తీసుకునే ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లు, పాలు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సంతోషి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామస్తుల శ్రమదానం



శ్రమదానం చేస్తున్న గ్రామస్తులు

తిర్యాణి: మండలంలోని భీంజిగూడ గ్రామం నుంచి బుగ్గగూడ గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న కల్వర్టు అప్రోచ్ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. దీంతో మండలంలోని దాదాపు 16 గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే ఉమ్మడి పంగిడిమాదర పంచాయతీ పరిధిలోని గ్రామస్తులంతా కలిసి సోమవారం శ్రమదానం చేపట్టి కల్వర్టు అప్రోచ్ రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చారు. సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతీ వర్షకాలం కల్వర్టు అప్రోచ్ రోడ్డు కోతకు గురవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కరం చూపించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న కాంప్లెక్స్ హెచ్ఎం

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యను మరింత బలోపేతం చేయాలని స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం జంగు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కనీస సామర్థ్యాలు పెంపొందించేలా కృషి చేయాలన్నారు. పాఠశాలకు సక్రమంగా వెళ్లాలని, సెలవు తీసుకోవాల్సి వస్తే ఒక రోజు ముందు సమాచారం ఇవ్వలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.